నేడు ఛాత్తాద వైష్ణవ వివాహ పరిచయ వేదిక

నిర్మల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి) ఛాత్తాద వైష్ణవ సంఘం వివాహ పరిచయ వేదిక ఆదివారం పట్టణంలోని పెన్షనర్స్ సంఘ భవనం (కోర్టు పక్కన)లో జరుగుతుందని సంఘ అధ్యక్షులు వకుళా భరణం మధు సూదన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పరిచయ వేదిక ప్రారం భమవుతుందని, పాల్గొనేవారు తమ పేర్లను ముందు గానే పెన్షనర్స్ సంఘ భవనంలో నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు.



దారి తప్పుతున్న ధాన్యం

- వరుస తనిఖీల్లో వెలుగుచూస్తున్న అవినీతి
- ఇటీవల ఓ రైస్‌మిల్లుపై విజిలెన్స్ అధికారుల దాడి
- జిల్లా వ్యాప్తంగా 28 రైస్‌మిల్లుల సీజ్, కేసుల నమోదు
- కోట్ల రూపాయల సీఎంఆర్ ధాన్యం స్వాహా

నిర్మల్ జిల్లాలో దాదాపు 28కు పైగా రైస్‌మిల్లులు కోట్లాది రూపాయల సీఎంఆర్ ధాన్యాన్ని మాయం చేసినట్లు విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడవుతున్నప్పటికీ వారిపై అధికారులు ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లాలో రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా మారి పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాఖలను తమ గుప్పిట్లోకి తీసుకొని శాసించే స్థాయికి ఎదిగాయన్న విమర్శలున్నాయి. రాజకీయ అండదండలతో మిల్లర్లంతా బహిరంగంగానే సీఎంఆర్ ధాన్యాన్ని స్వాహా చేస్తుండగా అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండడం శోచనీయం.

నిర్మల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని 28 రైస్‌మిల్లులను ఇప్పటికే సీజ్ చేశారు. తాజాగా కడెం మండలంలోని ఓ రైస్‌మిల్లుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ దాడుల్లో 2024-2025 రబీ సీజన్‌కు సంబంధించి దాదాపు 2684 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ స్వాహా అయినట్లు నిర్ధారించారు. అధికారుల విచారణలో పక్కదారి పట్టినట్లు తేలిన ధాన్యం విలువ సుమారు రూ.6 కోట్లకు పైగా ఉంటుందని సంబంధిత యంత్రాంగం పేర్కొంటుండడం అక్రమాలు తారస్థాయికి చేరుకున్నాయనడానికి నిలువెత్తు సాక్ష్యం. అలాగే కొద్ది రోజుల క్రితం ఖానాపూర్ పరిధిలోని 3 రైస్‌మిల్లులపై కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు జిల్లాలోని మరో 23 రైస్‌మిల్లులను తనిఖీ చేసి అక్రమాలను నిర్ధారించారు. ఈ రైస్‌మిల్లులన్నింటిపై కేసులు నమోదు చేసి వాటిని సీజ్ చేశారు. రైస్‌మిల్లర్లు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ అధికారులను పక్కదోవ పట్టిస్తుండడం రివాజుగా మారింది. దాదాపు నాలుగేళ్ల నుంచి ప్రతియేటా రెండు సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు పక్కదోవ పట్టించినట్లు ఇప్పటికే నిర్ధారణ అయ్యింది.

జిల్లా వ్యాప్తంగా ఇదే దందా..

నిర్మల్ డివిజన్‌తో పాటు భైంసా, ఖానాపూర్ డివిజన్ పరిధిలోని మరికొన్ని రైస్‌మిల్లులు కొంతకాలం నుంచి సీఎంఆర్ ధాన్యం వ్యవహారంలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు వెల్లడవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొంతమంది రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధుల అండదండలతో రైస్ మిల్లులు ఇష్టారా జ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి వరుస పెట్టి సీఎంఆర్ ధాన్యం వ్యవహారంలో అధికారులను బురిడీ కొట్టించారన్న ఫిర్యాదులున్నాయి. కొనుగోళ్లలో వేగం పెంచడంతో పాటు కొనుగోలు కేంద్రాల నుంచి యుద్ధ ప్రాతిపదికన మిల్లులకు ధాన్యాన్ని తరలించడం ఆ మిల్లుల యజమానులకు వరంగా మారింది. ఓ వైపు ఖరీఫ్ ధాన్యం మిల్లింగ్ ప్రక్రియ పూర్తికాకముందే రబీ సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్ కోసం రైస్‌మిల్లులకు తరలిరావడంతో నిల్వల లెక్కలన్నీ గందరగోళంగా మార్చేశారని చెబుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న రైస్‌మిల్లుల యజమానులు ఇష్టారాజ్యంగా ప్రస్తుత సీజన్ ధాన్యం నిలువలను చూపుతూనే గడిచిన సీజన్‌లకు సంబంధించిన ధాన్యం నిల్వలను పక్కదోవ పట్టించారన్న ఫిర్యాదులున్నాయి.

28 రైస్ మిల్లులపై కేసులు..

ఇప్పటివరకు జిల్లాలోని 28 రైస్‌మిల్లులపై సీఎంఆర్ అక్రమాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. ఈ రైస్‌మిల్లులు దాదాపు రూ.300 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యాన్ని పకడ్బందీగా పక్కదోవ పట్టించినట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. వీటిని సీజ్ చేసినప్పటికీ సదరు యజమానులు మరో కొత్త పథకానికి తెరతీశారన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఇలా కేసులు నమోదైన రైస్ మిల్లుల యజమానులు బినామీల పేరిట మళ్లీ కొత్త రైస్‌మిల్లులను ఏర్పాటుచేసి వాటికి సైతం సీఎంఆర్ ధాన్యాన్ని కేటాయించేలా చూసుకుంటున్నారని అంటున్నారు. దీంతో పాత మిల్లుల వ్యవహారం మూలకు పడుతోందని చెబుతున్నారు.



లక్ష్మణచాంద మండలం తిరుపెల్లిలోని రైస్‌మిల్లు నుంచి ధాన్యం తరలిస్తున్న లారీని పట్టుకున్న దృశ్యం (ఫైల్)

రాజకీయ అండదండలతోనే..

జిల్లాలో కొన్ని రైస్‌మిల్లుల యజమాన్యాలు రాజకీయ అండదండలతోనే ఈ అక్రమాల పరంపర కొనసాగిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఇద్దరు ఎమ్మెల్యే లు స్వయంగా అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్లర్లకు వత్తాసు పలికారన్న ప్రచారం జరిగింది. అప్పటి అధికార పార్టీ నేతల అండదండలతోనే రైస్‌మిల్లర్లు ఉన్నతాధికారులను సైతం బురిడీ కొట్టించి సీజన్‌ల వారీగా ధాన్యం నిల్వల లెక్కలన్నింటినీ తారుమారు చేశారంటున్నారు. అధికారులు సాధారణ తనిఖీలు జరిపే సమయంలో ఉన్నది లేనట్లు... అంతా కనికట్టు అన్న చందంగా అక్కడి సీన్‌ను తలకిందులు చేసి తప్పుడు లెక్కలతో సర్దిచెప్పేవారని అంటున్నారు. మిల్లర్ల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు వాస్తవాలకు భిన్నంగా నివేదికలు రూపొందించి మిల్లర్లకు పరోక్షంగా సహకరించారన్న ఫిర్యాదులున్నాయి. దాదాపు ఐదేళ్లుగా ప్రతి ఖరీఫ్, రబీ సీజన్‌లలో సీఎంఆర్ ధాన్యం అక్రమాలు జరగడానికి పరోక్షంగా అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్నారు.

నవజాత శిశువుల మరణాలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నయనారెడ్డి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సారంగాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అప్పుడే జన్మించిన నవజాత శిశువుల మరణాలపై క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు హెల్త్ అసిస్టెంట్లు పర్యవేక్షక సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నయనారెడ్డి అన్నారు. శనివారం సారంగాపూర్ మండలంలోని ఆలూర్ గ్రా మంలో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాల కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని ఎక్కడ కూడా గర్భిణులు పిల్లలు వ్యాక్సిన్ మిస్ కాకుండా చూడాలని చెప్పారు. అలాగే నవజాత జననాల వారోత్సవంపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు ఈ కార్యక్రమంలో అమలు చేయాలని సూచించారు. కొత్తగా పుట్టే పిల్లల మరణాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గర్భిణులకు ప్రసూతి మహిళలకు అవగాహన కల్పించాలని చెప్పారు. శీతాకాలంలో పసిపిల్లలకు నిమోనియా సోకితే మరణాలు సంభవించే అవకాశాలు ఉంటాయని ఈ విషయంలో ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం దగ్గు జలుబు లాంటి సమస్యలు కనిపిస్తే వెంటనే వారిని ఆసుపత్రిలకు పంపేలా అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా పుట్టిన పిల్లల జాబితాన్ని తయారు చేసుకొని నిరంతరం వారి ఇళ్లకు వెళ్లి ఎప్పటికప్పు డు పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ జవాద్, పీహెచ్ఎన్ అధికారి విమల్, ఆరోగ్య పర్యవేక్షణలో కృష్ణ మోహన్‌గౌడ్, శ్రీనివాస్ ఉషారాణి, ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

వైశ్యులు రాజకీయాల్లోకి రావాలి

- నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిర్మల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైశ్యులు కేవలం వ్యాపారానికి కాకుండా రాజకీయాలకు కూడా రావాలని నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని నాయుడు వాడలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి మందిరంలో నిర్వహించిన లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణానికి ముఖ్య అతిథిగా హాజరై వాసవి మాతని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘ భవన పునర్నిర్మాణానికి తన సొంత ట్రస్ట్ నుంచి 3 లక్షల రూపాయలు విరాళం ఇస్తున్నట్లు తెఇలపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిచినటువంటి పట్టణ అధ్యక్షులు ఆమెడ శ్రీధర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూమయ్య, చిన్నయ్య, రాంనాథ్, నిజామాబాద్ పట్టణ అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్, దేవర శెట్టి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు



పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పుస్తక ప్రదర్శనలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలురు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భిక్షపతి నాయక్, లింగయ్య, శ్రీకాంత్, గ్రంథాలయ సిబ్బంది పి.విజయశ్రీ, రాథోడ్ మోహన్ సింగ్, బి. లెనిన్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేశ్వరాలయంలో కుంకుమార్చన

- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

లోకేశ్వరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లోకేశ్వరాలయంలో కొనసాగుతున్న అష్ట నాగ కాలభైరవ సమేత శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా శనివారం కుంకుమార్చన కార్యక్రమాన్ని వేద పండితులు శ్రీ గురుమంచి చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే శివాలయంలో అష్ట నాగ కాలభైరవ సమేత శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఐరన్ 'మ్యాన్ విజేత' డా. నరసింహా రెడ్డికి ఘన సన్మానం



డా. నరసింహారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గోవాలో నిర్వహించిన ఐరన్ మ్యాన్ టైటిల్ విజేతగా నిలిచిన ని ర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యూరో వైద్యులు బివేల్. నరసింహారెడ్డిని వినాయక్ సాగర్ స్విమ్మింగ్ గ్రూప్ సభ్యులు శనివారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. 64 దేశాలకు చెందిన పలువురు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేవలం ఎనిమిది గంటల వ్యవధిలో 21 కిలో మీటర్ల రన్నింగ్, 90 కిలోమీటర్ల సైక్లింగ్, 1.9 కిలోమీటర్ల ఈత పోటీల్లో విజేతగా నిలిచానన్నారు. రన్నింగ్, సైక్లింగ్ కష్టం కాలేదు కాని అరేబియా సముద్రంలో అలలు, నిర్దేశించిన రూట్ మ్యాప్ లక్ష్యాన్ని చేరుకోవడం సులభం కాదన్నారు. కఠోర దీక్షతో ఈ విజయాన్ని సాధించానన్నారు. సీనియర్ సిటిజన్ వెంకట రమణ మాట్లాడుతూ... డా. నరసింహారెడ్డి ఐరన్ మ్యాన్ విజేతగా గెలుపొందడం చాలా అభినందనీయమని, నిర్మల్ జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్విమ్మింగ్ సభ్యులు గుమ్ముల అశోక్, బోడ శ్రీనివాస్, ఈదన్నగారి రాజేశ్వర్, ఆర్కారి రాజేందర్, భోజన్న, సల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాత కాంట్రాక్టర్లకే పెద్దపీట



యూనివర్సిటీ క్యాంపస్ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు ఫైల్ (ఇన్‌సెట్లో)

- ఆర్జీయూకేటీ మెస్ టెండర్లలో తీరు
- ఆరోపణల గోడను దాటి నిర్ణయం
- ఏడేళ్లుగా కొనసాగుతున్న వారికే కాంట్రాక్ట్
- నిబంధనల ఉల్లంఘన, నిరసనలు బేఖాతరు

బాసర , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో మెస్ కాంట్రాక్టుల కేటాయింపు ఎట్టకేలకు పూర్తయింది. ప్రక్రియ ఆలస్యంగా ముగిసినప్పటికీ, అది అనేక వివాదాలకు, తీవ్రమైన ఆరోపణలకు దారితీసింది. ఏనిమిది నెలల జాప్యం తర్వాత ఇటీవల యూనివర్సిటీ అధికారులు చివరికి కొత్త మెస్ టెండర్లను ఖరారు చేశారు. అయితే, ఏడేళ్లుగా (2018 నుంచి) కాం ట్రాక్టు నిర్వహిస్తున్న పాత కాంట్రాక్టర్లకే మళ్లీ యూనివర్సిటీ అధికారులు కాంట్రాక్ట్‌ను కట్టబెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూనివర్సిటీలో మొత్తం 9 వేల మంది విద్యార్థులు ఉండగా, వారికి ఆహార బాధ్యతలను అప్పగించేందుకు మార్చి 20వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ ప్రకారం నెల రోజుల్లోనే టెండర్‌ను ఖరారు చేయాల్సి ఉన్నా, రాజకీయ, కాం ట్రాక్టర్‌ల ఒత్తిళ్ల కారణంగా ప్రక్రియను జాప్యం చేస్తూ వచ్చారు.

నియమాలను తుంగలో తొక్కి..

నిబంధనల ప్రకారం మెస్ నిర్వహణ కాంట్రాక్టు ఏడాది కాలమే ఉండాలి లేదా రెండేళ్లకు ఒకసారి టెండర్ నిర్వహించాలి. కానీ, ఆర్జీయూకేటీ అధికారులు 2018లో టెండర్ పొందిన సంస్థల కాంట్రాక్టును 2025 వరకు ఏకంగా ఏడేళ్ల కొనసాగించడం గమనార ం.

లోపాల మయమైనా.. మళ్లీ వారికే!

పాత కాంట్రాక్టర్ల నిర్వాహణపై గత కొన్నేళ్లుగా తీవ్రమైన ఫిర్యాదులు, ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. మెస్‌లలో ఫుడ్ పాయిజన్ ఘటనలు, భోజనం లో క్రిమి కీటకాలు, పురుగులు వచ్చినప్పటికీ అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మెస్ కాంట్రాక్టర్లను మార్చాలని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలు చేసినా, యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించలేదు. తాజాగా కాంట్రాక్టు పొందిన నాలుగు సంస్థల్లో అనేక లోపాలు ఉన్నా, వాటి నిపట్టించుకోకుండా వారికే మళ్లీ కాంట్రాక్ట్‌ను కట్టబెట్టడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

కీలక అధికారులకు తెలియకుండా ఎంపిక?

టెండర్ ప్రక్రియకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. వీరందరు పర్యవేక్షించారు. టెండర్ ప్రక్రియ అంతా ఈ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. కానీ ఖరారు మాత్రం కనీసం సమాచారం లేకపోవడం చర్చకు దారి తీసింది. విద్యార్థుల భవిష్యత్తు, ఆహార భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించి, పాత కాంట్రాక్టర్లకే మళ్లీ కాంట్రాక్టు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పారిపాలన విభాగంలో కీలక అధికారి ఏకపక్షంగా టెండరులు ఖరారు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్‌కు సంబంధించి యూనివర్సిటీ ఓఎస్‌డి, పరిపాలన అధికారి మురళీదర్శన్‌ను ఫోన్లో సంప్రదించే ప్రయత్నం చేయగా అందు బాటులోకి రాలేదు.

సహ చట్టం సామాన్యుల వజ్రాయుధం

- సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న సయ్యద్ కలీం

దిలావర్‌పూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం సామాన్యుల చేతిలో వజ్రాయుధమని సహ చట్టం సామాజిక కార్యకర్తల ఫోరం తెలంగాణ జనరల్ సెక్రటరీ సయ్యద్ కలీం అన్నారు. శనివారం మండల కేం ద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం దేశ, రాష్ట్ర పరిపాలన అంశాలలో పారదర్శకత, జవాబుదారీతనానికి దోహద పడుతుందన్నారు. పరిపాలన యంత్రాంగంలో పూర్తి పారదర్శకత సాధించడానికి ఏఏ అంశాలపైన సమాచారాన్ని కోవచ్చో వివరించారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులు, వాటి వినియోగం, లబ్ధిదారుల వివరాలపై సమాచారం కోరవచ్చన్నారు. తద్వారా దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తీసుకునే నిర్ణయాలు, ఆమోద ప్రక్రియలు, ఫైళ్ల కదలికపై వివరాలు తెలుసుకోవచ్చన్నారు. స్థానిక సంస్థలు, కార్యాలయాలు అందించే పౌర సేవలు, ఉద్యోగుల పనితీరు, సిబ్బంది వివరాలపై సమాచారం అడగడం ద్వారా మెరుగైన పరిపాలన సాధ్యమవుతుందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా వినియోగించడం ద్వారా ప్రతి పౌరుడు పరిపాలనలో భాగస్వామి కావచ్చని, సమాజంలో ఒక ఆరోగ్యకరమైన, పారదర్శక పాలన వస్తుందని ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, సయ్యద్ ఆబిద్ అలీ పాల్గొన్నారు.

శిశు మందిర్‌లో జన జాతీయ గౌరవ దివస్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ముథోల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లోని శిశు మందిర్ పాఠశాలలో శనివారం గిరిజన యోధుడు మన్యం వీరుడు బిర్సాముండా జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిని వెలిగించారు. ప్రధానాచార్యులు సారథి రాజు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, గిరిజన పుత్రుల విముక్తి కోసం సమర శంఖం పూరించిన ధీరుడు, బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడి బ్రిటిషర్లకు సింహ స్వప్నంలా నిలిచి వ్యక్తి, అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ లాంటి మన్యం వీరులకు స్ఫూర్తిని ఇచ్చిన వ్యక్తి అన్నారు. పార్లమెంట్ ఆవ రణలో స్థానం సంపాదించుకున్న ఏకైక వీరుడు బిర్సాముండా అని జార్ఖండ్ అడవుల్లో ముండా తెగలో జన్మించి ముండా జాతికి ఆశా కిరణంలా ఆరాధ్య దైవంగా మారి భగవాన్ బిర్సాముండాగా పేరు గాంచాడన్నారు. అలాంటి వీరుల చరిత్రను చదివి ప్రతి ఒక్కరూ యదలో దేశభక్తిని పెంపొందించుకుని భావి పౌరులుగా ఎదగాలని తెలియజేశారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవం రోజున నిర్వహించిన పరంపరాగత ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహు మతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్న శర్మ, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కళలను కాపాడుకోవాలి: పాకాల

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వైస్ ఛైర్మన్, పాకాల ఫౌండేషన్ ఛైర్మన్ పాకాల రాంచందర్ అన్నారు. శనివారం నిర్మల్ పట్టణంలోని బుధవార్‌పేట్ అంజుకుమార్ జ్యువెలర్స్‌లో పగటి వేషాల కళా బృందంకు చెందిన కళాకారులు మిర్యాలవార్ గణేష్, భైరవ, దేవిదాస్‌లను ఆయన సన్మానించారు. అనంతరం పాకా ల రాంచందర్ మాట్లాడుతూ పగటి వేషం అనేది ఒక జానపద కళారూపమని ఈ కళలో అనేక వేషాలు ధరించి, ప్రేక్షకులను అలరించేవారు. పూర్వం ప్రజల సమస్యలను రాజుల దృష్టికి తీసుకురావడానికి, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడానికి ఈ కళను ఉపయోగించేవారని ఇలాంటి కళలను కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంజు కుమార్, బ్రహ్మం, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సన్మానిస్తున్న పాకాల రాంచందర్

బాసరలో మంచు దుప్పటి

- గోదావరి తీరాన కనువిందు చేస్తున్న సూర్యోదయం



ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారులను కమ్మేసిన పొగమంచు

బాసర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శీతాకాలం చలి తీవ్రత పెరగడంతో, బాసర పుణ్యక్షేత్రం కొత్త అందాలను సంతరించుకుంది. ఉదయం పూట కురుస్తున్న దట్టమైన మంచు కారణంగా, జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పరిసరాలు, రహదారులన్ని మంచు దుప్పటిని కప్పుకున్నాయి. ఉదయం 8 గంటల వరకు దారుల్ని దట్టమైన మంచుతో కప్పి ఉండడం వల్ల ప్రయాణికులు, భక్తులు చలి తీవ్రతను అనుభవిస్తున్నారు. అయితే ఈ చలిలోనే ఓ అద్భుత దృశ్యం స్థానికులను, పర్యాటకులు కనువిందు చేస్తోంది. గోదావరి తీరంలో మంచు తెరల మధ్య నుంచి సూర్యుడు ఉదయించే సన్నివేశం ఎంతో మనోహరంగా కనిపిస్తోంది. లేత బంగారు కిరణాలు మంచు పొరల గుండా ప్రసరిస్తూ, నదిపై, ఆలయ పరిసరాలపై ఒక ప్రత్యేక కాంతిని వెదజల్లుతున్నాయి. ఈ శీతల వాతావరణం భక్తులకు స్వచ్ఛమైన, ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తోంది.



పార్ది(బి) గ్రామంలో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ

బోథ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని పార్ది(బి) గ్రామానికి చెందిన సార్‌మేడి లక్ష్మణ్ సహోదరుడు మృతి చెందడంతో శనివారం ఎంపీ జి.నగేష్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రాజు, మండల పార్టీ కన్వీనర్ బోరేరవీందర్,మాజీ ఉపసర్పంచ్ కె.మురళిధర్ ఉన్నారు.

వానరానికి అంత్యక్రియలు



వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

బాసర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పరిసరాల్లో నిత్యం తిరిగే ఒక కోతి అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆలయ వాగ్దేవి సొసైటి సిబ్బంది దానికి సాంప్రదాయ బద్ధంగా ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్యంతో చనిపోవడాన్ని గమనించిన సొసైటి సిబ్బంది బబ్లు, సాంప్రదాయం ప్రకారం కొబ్బరికాయ కొట్టి, పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం సమీపంలో కోతికి అంత్యక్రియలు పూర్తి చేశారు.

18న బాస్కెట్ బాల్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక

నిర్మల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18న జడ్పీహెచ్‌ఎస్ తిమ్మాపూర్‌లో బాస్కెట్ బాల్ అండర్- 17 జిల్లా స్థాయి బాల బాలికల జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీందర్ గౌడ్ తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థుల్లో శారీరక ధృఢత్వం పెరుగుతుందని జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థ సారధి అన్నారు. మూడవ ఖేలో ఆదిలాబాద్ పోటీల్లో భాగంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీజీఎస్ డిఫెన్స్ అకాడమీ సహకారంతో ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. అథ్లెటిక్స్‌లోని వివిధ విభాగాల్లో పోటీలు జరపగా.... విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అతిథులతో పాటు ఆయా స్కూళ్ల ప్రిన్సిపల్లను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థ సారధి మాట్లాడుతూ.... ప్రైవేట్ పాటశాలల విద్యార్థులకు అథ్లెటిక్ పోటీలు నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో రెండు శాతం కోటా లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచేలా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ జక్కుల శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రామేశ్వర్, పీ.ఈ.టీ కార్యదర్శి సాయి కుమార్, స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు, ఒక్లె పాఠశాల డైరెక్టర్ సాయిని రవికుమార్, ప్రధాన కార్యదర్శి కొమ్ము కృష్ణ, అథ్లెటిక్ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన రైతు సంఘం నాయకులు

లోకేశ్వరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో లోకేశ్వరం మండలంలోని హవర్గా గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ మాట్లాడుతూ... వరి కొనుగోలు కేంద్రంలో 40 కేజీల బస్తాకు రెండు కిలోల 600ల గ్రాముల బరువుతో అదనపు తూకం వేస్తున్నారని, రైతులను దోచుకోవడం ఆనవాయితీగా మారింది. అధికారులు కలెక్టర్ ఆర్భాటంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికిని ప్రతి గ్రామంలో ఇదే పద్దతుల్లో తూకం వేసి రైతాంగాన్ని ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు కలిసి రైస్ మిల్లర్స్‌తో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారు. క్వింటాల్‌కు ఐదు కిలోలు రైతు నుండి కాజేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలో వచ్చిన సమయంలో కొంత ఆర్భాటం చేసినప్పటికిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనసాగించిన దోపిడీనే నేడు కొనసాగిస్తున్నారు. రైతాంగం దగ్గర బీఆర్‌ఎస్ కేసీఆర్ ప్రభుత్వం అదనపు తూకం వేశారని చెప్పి మాట్లాడినటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులపై జరుగుతున్నటువంటి అన్యాయాన్ని కొనసాగిస్తున్నారు. వెంటనే వరి కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, సంచి బరువును మాత్రమే తూకం వేయాలి కాని అదనపు రెండు కిలోలు తూకం వేయడం అంటే అన్ని గ్రామాల్లో ఇదే తంతు జరుగుతుంటే రైతాంగం ఆలోచించాల్సిన అవసరం ఉంది. అధికారులను కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని తెలంగాణ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం రైతాంగానికి పిలుపునిస్తోందన్నారు. వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన దృశ్యం

ఆలయ అభివృద్ధికి కృషి

● నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీ హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తానని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం హనుమాన్ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మెంగ శేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీకాంత్, అలాగే కాలనీకి చెందిన ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్, రాజేశ్వర్, అయ్యన్నగారి మధు, తలవేద నారాయణ, తిరుపతి రావు, వజ్రపాల్, నర్సారెడ్డి, మూడారపు సోమేష్, తదితరులు ఉన్నారు.



నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలి: ఎంఈవో

సిరికొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలి అని ఎంఈవో సునీల్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వారి వారి ఇంటి వద్ద తయారుచేసిన పలు రకాల వంటకాలను ప్రదర్శించారు.

ఢిల్లీ బయలుదేరిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నిర్మల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ గవాయిపై దాడి జరిగిన సంఘటన నిరసిస్తూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రం నుంచి శనివారం ఢిల్లీ బయలుదేరినట్లు జిల్లా నాయకులు తెలిపారు.



ఢిల్లీకి వెళ్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు

పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీతపై అవగాహన

నర్సాపూర్(జి), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ పాఠశాలలో స్వాధ్యాయ కార్యకర్తలు 10వ తరగతి విద్యార్థులకు భగవద్గీత సందేశాలను అందించారు. భగవద్గీత పఠనం ద్వారా విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడం, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ సంస్కారవంతమైన విద్యను అభ్యసించాలని వారు కోరారు.



విద్యార్థులకు భగవద్గీత గురించి వివరిస్తున్న దృశ్యం

వసతి.. ఆగమాగం

(5వ పేజీ తరువాయి...)

రాత్రినిద్ర చేపట్టి విద్యార్థుల సాదక బాధకాలను తెలుసుకునే వారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు.

చన్నీళ్ల స్నానమంటేనే వణుకు

రోజు రోజుకు చలి తీవ్రత పెరిగిపోతున్నా.. అధికారులు అప్రమత్తమైనట్లు కనిపించడం లేదు. చాలాచోట్ల వాటర్‌హీటర్ పరికరాలు మరమ్మతులకు నోచుకోక మూలన పడి కనిపిస్తున్నాయి. దీంతో గత్యంతరం లేక చన్నీళ్ల స్నానాలతోనే విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. తీవ్రమైన చలితో పలువురు విద్యార్థులు అనారోగ్య భారీన పడుతున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేపడితే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి వసతిగృహాల్లో వాటర్ హీటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసినా.. నిర్వహణ లేక నిరుపయోగంగానే మారుతున్నాయి. చన్నీళ్ల స్నానానికి భయపడి కొంత మంది విద్యార్థులు రోజుల తరబడి స్నానం కూడా చేయడం లేదని తెలుస్తుంది. అపరిశుభ్రతతో చర్మవ్యాధులు సోకి విద్యార్థులు అనారోగ్య భారీన పడుతున్నారు.

విద్యార్థులు ఇంటిబాట

వసతి గృహాల్లో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. తీవ్రమైన చలికి భయపడుతున్న పలువురు విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. గడిచిన పక్షం రోజుల్లోనే విద్యార్థుల హాజరు శాతం భారీగా పడిపోయిన్నట్లు తెలుస్తుంది. తల్లిదండ్రులు ఎంత నచ్చ చెప్పినా.. వసతిగృహాలకు వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. ఇప్పటికీ చాలా హాస్టళ్లలో బెడ్‌మంచాలు కూడా అందుబాటులో లేవు. దీంతో ఇరుకు గదుల్లోనే నేలపై విద్యార్థులు కునుకు తీస్తున్నారు. సరైన నిద్ర లేకపోవడంతో పలు రకాల అనారోగ్య సమస్యల భారీన పడుతున్నారు. ముఖ్యంగా నిద్రలేమి, అజీర్తి సమస్యలతో చదువులపై దృష్టి సారించలేక పోతున్నారు. తరచు ఆసుపత్రుల పాలు కావడంతో అనారోగ్యం పేరిట సెలవు పెట్టి ఇంటిబాట పడుతున్నారు. శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు నిండు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలను చేపడితే ఎన్నో లోపాలు, లొసుగులు, అధికారుల నిర్లక్ష్యం బయటపడే అవకాశం ఉందంటున్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రిమ్స్ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కొనసాగింపు గందరగోళానికి తెర పడింది. 7 నెలలుగా తమను రెన్యువల్ చేయాలంటూ 54 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. గతంలో ఈ విషయమై ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిసితమ సమస్యలు విన్నవించారు. ఎమ్మెల్యే పలుమార్లు రాష్ట్ర మంత్రితో పాటు డీఎంఈకి ఉద్యోగుల సమస్యలు విన్నవించగా... ఎట్టకేలకు 54 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి కొనసాగించేలా తాజాగా ప్రభుత్వం జీఓ ను విడుదల చేసింది. దీంతో అవుర్సింగ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పల్లకి ఊరేగింపు

బోథ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయంలో వెలిగించిన కార్తీక దీపం ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని భక్తులు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇయోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ పాల్గొని పల్లకి మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తీ శ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి వ్యక్తి భక్తీ భావనను అలవర్చుకోవాలని కోరారు. అంతకు ముందు మండల కేంద్రంలోని మహిళలు మంగళహారతులు చేతపట్టుకొని ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దృశ్యం

డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాల నివారణ

▸▸ నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

నిర్మల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల తగ్గింపులో డిఫెన్సివ్ డ్రైవింగ్ అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. రోడ్డుపై అప్రమత్తంగా ఉండటం, పరిసరాలను గమనించడం, ఇతరుల తప్పిదాలను ముందుగా అంచనా వేయడం ప్రాణాలను రక్షిస్తుందని పేర్కొన్నారు. నిర్మల్ పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఎంటీ డ్రైవర్లు, ఆర్ఐలు, ఆర్‌ఎస్సైలకు డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై శిక్షణ అందించారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం ఆర్ఐ రామ్ నిరంజన్ రావు ఆధ్వర్యంలో నిర్మల్ ఎంటీ పోలీస్ డ్రైవర్‌లకు డిఫెన్సివ్ డ్రైవింగ్ గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణలో ఆర్ఐలు శేఖర్, రామకృష్ణ, ఆర్‌ఎస్సైలు సాయికృష్ణ, రవి, మహేష్, వినోద్ పాల్గొన్నారు.

డిఫెన్సివ్ డ్రైవింగ్ అంటే ఏమిటి?

ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, ఇతర వాహనదారుల నిర్లక్ష్యం వల్ల సంభవించే ప్రమాదాల నుండి మనలను కాపాడుకునే జాగ్రత్తగా డ్రైవ్ చేసే విధానమే డిఫెన్సివ్ డ్రైవింగ్.

ప్రధాన డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలు..

- తప్పుదారిలో వచ్చే వాహనాలను ముందుగానే గుర్తించాలి.
- మొబైల్ ఉపయోగించే డ్రైవర్లకు దూరంగా ఉండాలి.
- రోడ్డు పక్కన పార్ చేసిన వాహనాల డోర్లు అకస్మాత్తుగా తెరవొచ్చు జాగ్రత్త.
- సిగ్నల్ జంప్ చేసే వాహనాలను గమనించాలి.
- ఆకస్మిక బ్రేకింగ్‌కు దూరంగా ఉండేందుకు అవసరమైన దూరం పాటించాలి.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

నిర్మల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రవి ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 10 నుండి 15 వరకు నిర్వహించినట్లు ఆదిలాబాద్ 32 బెటాలియన్ సుబేదార్, జగదీప్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అందులో భాగంగా విద్యార్థులకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవ వంటి విలువలను పెంపొందించడానికి ఎన్‌సీసీ ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో 100 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ పొందారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు 'డ్రిల్ ప్రాక్టీస్', వెపన్ ట్రైనింగ్ శిక్షణను ఇవ్వడం జరిగింది. ఎన్‌సీసీ శిక్షణ ఉన్నత విద్య అవకాశాలలోనే కాకుండా ఉపాధి అవకాశాలలో సైతం ఎన్‌సీసీ క్యాడెట్లకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని, దేశ వ్యాప్తంగా అనేక సేవ కార్యక్రమాల్లో పాల్గొని దేశ సేవ చేయవచ్చని ప్రిన్సిపాల్ రాణి, కరస్పాండెంట్ వెంకటేశ్వర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో కేర్ టేకర్ సాకేత్, కృష్ణవేణి, పీఈటీ ఖయ్యుంఖాన్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల జన్మదిన వేడుకలు

బోథ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన పురస్కరించుకుని మార్కెట్‌కమిటీ చైర్మన్ బి.గంగారెడ్డి ఆత్మచైర్మన్ రాజుయాదవ్‌ల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ రైతాంగానికి అండగా నిలుస్తున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర మంత్రులకు లేఖలు రాసి నిబంధనలను సడలించాలని విన్నవించారన్నారు.

సైనికుడికి ఘన స్వాగతం

ఉట్నూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ఆర్మీలో చేరి 38 సంవత్సరాల పాటు దేశ సరిహద్దుల్లో పని చేసి శనివారం స్వగ్రామానికి చేరుకున్న రవీందర్ చౌహాన్‌కు మండలంలోని చీమనాయక్ తండా ప్రజలు ఘన స్వాగతం పలికారు. దేశ సరిహద్దు నేవిక దళంలో 38 సంవత్సరాల పాటు దేశ రక్షణ కొరకై పనిచేసి చిన్న స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగి నేవీక దళంలో సీఐ స్థావరకు పదోన్నతులు పొంది దేశ రక్షణ కోసం అనేక రకాల కష్టాలను అనుభవించి పదవి విరమణ పొంది చీమానాయక్‌తండాకు చేరుకున్న సందర్భంగా గ్రామస్థులు రవీందర్‌చౌహాన్‌కు మేళా కాలాలతో స్వాగతం పలుకుతు పూలతో టపాసులతో, స్వీట్లు తినిపించుకుంటు నృ త్యాలతో చేస్తూ ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునిల్ జాదవ్, షాంపూర్ మాజీ సర్పంచ్ జగదీశ్‌జాదవ్, సంజీవ్‌రాథోడ్, షేక్ జావిద్, సురేష్‌జాదవ్, బహదూర్‌సింగ్, జాదవ్‌కృష్ణ, రాజేశ్, రాంచందర్, రాజేందర్, ఓం ప్రకాష్, మహిళలు, గ్రామస్థులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



స్వగ్రామానికి చేరుకున్న సైనికున్ని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జాగృతి ముఖ్య నాయకుల సమావేశాన్ని శనివారం పట్టణంలో నిర్వహించారు. జాగృతి జిల్లా అధ్యక్షులు రంగినేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాసమస్యల పరిస్కారమే లక్ష్యంగా జాగృతి సమరశీల పోరాటాలకు కృషి చేస్తుందని అన్నారు. కల్వ కుంట్ల కవిత సంకల్పం సామాజిక తెలంగాణ, సమస్యలు లేని సమాజం సాధనకు జాగృతి కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర కార్యదర్శి దండెం ఆనంద్, జిల్లా జాగృతి నాయకులు అసపు ప్రమోద్, శ్రీపాద కార్తీక్, శ్రీనివాస్, మౌనిక రాథోడ్, డేవిడ్, అనిల్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి జోగురామన్న, నేతలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు అండగా వారికి న్యాయం జరిగేంత వరకు పోరాటాలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 21వ తేదీన భోరజ్ వద్ద ఉన్న రియలన్స్ పెట్రోల్ పంప్ వద్ద రైతుల నిరసన నిర్వహించనున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో అఖిల పక్ష రాజకీయ పార్టీలు, రైతు సంఘం నేతలతో కలిసి హలో రైతన్న చలో భోరజ్ ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మాజీమంత్రి జోగురామన్న అన్నారు. ఎటువంటి తేమ శాతం నిబంధనలు లేకుండా మద్ధతు ధరతో కొనుగోలు చేయాలని, కపాస్ కిసాన్ యాప్ ను రద్దు చేయాలన్నారు. ఎకరానికి ఏడు క్వింటల్ల పరిమితి కాకుండా పాత పద్ధతిలో పదమూడు క్వింటాల్లు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అలాల్ అజయ్, నారాయణ, యాసం నర్సింగ్ రావు,బండి దత్తాత్రి, కొండ రమేష్, సిగ్ర దేవేందర్, లోకారి పోశెట్టి, చిలుక దేవిదాస్, గండ్రత్ రమేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పత్తితో అభిషేకం

ఇచ్చోడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలంటూ.. బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ రావాలంటూ ముక్రా (కె) గ్రామ రైతులు కేసీఆర్ చిత్రపటానికి రైతులు పండించిన పత్తి పంటతో అభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంట కొనుగోలు చేయక మార్కెట్లో పంటను రైతులు ఎండబెడుతున్నారని.. ఏకరానికి 7 క్వింటాళ్ల పత్తిని కొనగోలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏకరానికి 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారని గుర్తుచేశారు. మళ్లీ రైతుల బతుకులు బాగు పడాలంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని రైతులు కొరుకుంటున్నారన్నారు. శనివారం ఇచ్చోడ మండలంలోని ముక్రా(కె) గ్రామంలోని పంట పొలంలో పత్తిని ఆరబెట్టిన పంటపై కేసీఆర్ చిత్రపటాన్ని ఉంచి పత్తితో అభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, మాజీ ఎంపీటీసీ సుభాష్, రైతులు పాల్గొన్నారు.



ముక్రా(కె) గ్రామంలో పత్తితో అభిషేకం చేస్తున్న పత్తి రైతులు

మంచాన పడిన యువకుడికి ఆర్థికసాయం

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రణధీర్ నగర్ కాలనీకి చెందిన నవీన్ అనే యువకుడికి శనివారం ఆగి ఉన్న ట్రాక్టర్ ఆకస్మాత్తుగా ముందుకు రావడంతో ట్రాక్టర్ ముందున్న ఆవులను కాపాడే ప్రయత్నంలో ట్రాక్టర్ యువకుడి పైనుంచి వెళ్లింది. ఈ ఘటనలో యువకుడి నడుము విరగడంతో ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు వెన్నెముక విరిగిందని, లేవడం, నడవడం కష్టమని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఆదిత్య ఖండస్కర్ సొసైటీ అధ్యక్షులు ఆదిత్య తన ఇంటికి వెళ్లి రూ.10 ఆర్థిక సహాయం అందజేశారు. దాతలు ముందుకువచ్చి తమవంతుగా సహాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె పాల్గొని ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించను న్న మహాసభల వివరాలను వెల్లడించారు. హక్కుల సాధనకు ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. మహాసభల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ఐదు వందల మంది ప్రతినిధులు పాల్గొననున్నారని, ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు కే.కళావతి, సురేందర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో పోలీస్ అక్క కార్యక్రమం

నర్సాపూర్ (జి), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) విద్యార్థినులు భద్రత, చైతన్యం కోసం పోలీస్ అక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఉమెన్స్ పోలీస్ కానిస్టేబుల్ విజయలక్ష్మి పాల్గొని విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే సమస్యలను ముఖ్యంగా వేధింపులు లేదా బాల్య వివాహాలు వంటి వాటిని నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థినులు పోలీస్ అక్క ఇచ్చిన సమాచారాన్ని శ్రద్ధగా విని, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



కేజీబీవీ ఆకారంలో విద్యార్థినులు

ఘనంగా బీర్సా ముండా జయంతి



భైంసాలో బీర్సా ముండా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భైంసా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుజిరిగల్లీ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో శనివారం స్వతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీర్సా ముండా చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆదివాసిల్లో పోరాట భావాలను రగిలించిన తొలి వ్యక్తి బిర్సా ముండా అని తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జిలకరి రాజేశ్వర్ పేర్కొన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వయం పాలన నినాదంతో సమరశంఖం పూరించిన ఆదివాసిల తొలి బాణం బీర్సా అన్నారు. పాతికేళ్ల వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప దేశ భక్తుడు బిర్సా ముండా అని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బిర్సా ముండా చేసిన పోరాటాలను వివరించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ..

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు బీర్సాముండా 150వ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నా యకులు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం బ్రిటిషర్లను ఎదిరించిన గొప్ప మహనీయుడు బిర్సాముండా అని కొనియాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందరో నిజమైన స్వాతంత్ర్య సమర యోధుల చరిత్రను బయటికి రాకుండా చేసిందన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి చరిత్రకారుడికి, స్వాతంత్ర్య సమరయోధులకు గుర్తు చేసుకుని ఘనంగా నివాళులర్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాం నాథ్, మేడిసెమ్మె రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కరిపే విలాస్, చిన్నారెడ్డి, జిల్లా కార్యదర్శి పుస్పూర్ నర్సారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొం డాజి శ్రావణ్, కార్యదర్శి గండి రాజు పాల్గొన్నారు.



బీర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వైఎస్సార్ కాలనీలో జాడు చలావ్ యాత్ర

నిర్మల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైఎస్‌ఆర్ కాలనీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో జాడు చలావ్ యాత్ర నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ మున్సిపల్ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయడం ద్వారా కాలనీ వాసులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.



జాడు చలావ్ యాత్రలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు

కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా
విద్యార్థులకు బాసర యాత్ర


బాసర యాత్రకు వెళ్లిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

నిర్మల్‌రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కాపూర్ గ్రామానికి చెందిన నాగుల మారుతిరెడ్డి ఆయన కుమార్తె అయిన ఆర్నిక పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఆర్టీసీ బస్సులోని 55 సీట్లు తానే కొనుక్కుని అక్కాపూర్ ప్రభుత్వ పాఠశాల పిల్లలను బాసరకు పంపాడు. తన కూతురు ఆర్నిక పుట్టిన రోజులు ఇంకా ఎన్నో జరుపుకోవాలని ఆమె ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని పలువురు దీవించారు. ప్రైవేట్ పాఠశాలలో చదివే పిల్లలను వారి పేరెంట్స్ కారుల్లో తిప్పుతారు. కాని ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు చాలా మట్టుకు పేద వారుంటారని అందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆర్నిక తండ్రి మారుతి రెడ్డి తెలిపారు. ఇలాగే మారుతిరెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని అనాథ పిల్లలకు ఏదైనా ఒక యాత్ర చూపించాలని డిపో మేనేజర్ పండరి తెలిపారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ఉట్నూర్,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతవర్ష జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని ఉమాపతి కుంట గ్రామ గిరిజనులకు శుక్రవారం శ్రీసత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు.కన్నాపూర్ మాజీసర్పంచ్ పెందూర్ జుగాదిరావు సమక్షంలో 40 గిరిజన కుటుంబాలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని జుగాదిరావు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో గ్రామపెద్దలు మరియు బాల వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

తూకం వేసిన సోయా వాపస్


నిలిపివేసిన సోయాబీన్ లారీలు ఇవే..


అధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న ఆత్మచైర్మన్

బోథ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్‌యార్డ్‌లో తూకం వేసి గోడౌన్‌కు పంపించిన లారీలలో ధాన్యం నాసిరకంగా ఉందంటూ అధికారులు నిలిపి వేశారు. దీంతో లారీల యజమానులు ఆందోళన వ్యక్త పరుస్తున్నారు. రెండు లారీలలో నింపిన 1329 బస్తాల ధాన్యం లారీలలోనే ఉండిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బోథ్ మార్కెట్ యార్డులో నాఫెడ్ ఆధ్వర్యంలో సోయాబీన్ పంట కొనుగోలు జరుగుతున్నాయి. అయితే రెండు రోజుల క్రితం తూకం చేసి పంపించిన లారీలలో ధాన్యం ఉండడంతో అధికారులు కొనుగోలుకు నిరాకరించారు. లారీల య జమానులు తమకులారీలకిరాయి డబ్బులు ఎ వరిస్తారు అంటూ మార్కెట్‌యార్డులో ఆందోళనకు దిగారు.ఆత్మచైర్మన్‌రాజు యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగింది.మరోసారి ధాన్యం పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

ఒక్కొక్కరికి ఒక్కోపద్ధతి

మార్కెట్ యార్డులో పంట కొనుగోళ్లలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. కొంత మంది రైతుల సఓయాబీన్ పంటను చెన్ని చేయకుండానే పంపడంతో ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో రీతిగా వ్యవహరించడం వల్లనే లారీలలో వెళ్లిన ధాన్యం తిరిగి వస్తుందని అంటున్నారు. గత నాలుగు రోజుల క్రితం సైతం మొక్కజొన్న, సోయాబీన్ పంట లారీలు సైతం తిరిగి పంపించినట్లు తెలిసింది.

వర్షాలతో దెబ్బతిన్న పంట

వర్షాల వల్ల పంట నాని కొంత మేరకు దెబ్బతిన్నది. ధాన్యం రంగు మారడం వెనుక అధిక వర్షాలే కారణమని రైతులుఅంటున్నారు. ప్రభుత్వం ప్రతిగింజనుకొంటాం అంటునే ఇన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తే పంట ఎలా అమ్ముకుంటామని రైతులువాపోతున్నారు. పంటలను పూర్తి స్థాయిలో ఆరబెట్టి పంపిస్తున్న రంగుమారిందంటూ అధికారులుపేర్కొనడంతో రైతులుపంటలను అమ్ముకునేందుకు అష్టక ష్టాలు పడాల్సి వస్తున్నది.అయితే పంటకొనుగోలు చేస్తున్న కొంతమంది ఉద్యోగులుతమకు అనుకూలంగాఉన్నవారిపంటవిషయంలోచూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

చన్ని పట్టిన తర్వాతనే

రైతులకు సంబంధించిన పంటను చన్నీ పట్టిన తర్వాతనే తూకం వేయాలని ఆత్మచైర్మన్ రాజుయాదవ్ అధికారులను ఆదేశించార. తమ భూములు నల్లరేగడి భూముల ఈ భూముల్లో పండించిన పంటలో సోయల సమానమైన మట్టి ఉంటుందని ఈ విషయంలో ఆలోచించాలని అధికారులను కోరారు. తిరిగిపంపిస్తే లారీలను అద్దెకు పెట్టలేమని లారీ యజమానులు వాపో తున్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నిర్మల్‌లో మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అల్లోల్ల

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని తిరుమల థియేటర్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో పురస్తు శ్రీసాయి చరణ్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పురస్తు శ్రీసాయి చరణ్ (చిన్న) తన మిత్రుడితో కలిసి బైక్‌పై వస్తూ అక్కడి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో శ్రీ సాయి చరణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహిస్తుండగానే మరణించాడు. సీనియర్ జర్నలిస్ట్ పురస్తు సురేందర్ కుమారుడైన శ్రీచరణ్ తేజ ప్రస్తుత డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందుతు న్నాడు. కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాన్ని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ భీమ్‌రెడ్డిలు సందర్శించి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత


ఎద్దు కళేబరం

నేరడిగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లఖంపూర్ గ్రామంలో కుప్టీఫీడర్ 11కేవివిద్యుత్ లైన్ తెగిపడి రైతుసురుసే గోవిందరావుకు చెందిన ఎద్దు మృత్యువాత గురైందిదీనిధర80వేల వరకు ఉంటుందని రైతు విలపిస్తూ చెప్పాడు. ఆరుగాలం పంట పనులకు ఉపయోగించుకునే ఎద్దుమృతితో కుటుంబ సభ్యులు లబోదిబోమంటూ ఇప్పుడెలా పనులుచేసుకునేదని అధికారులకు మొరపెటుకుంటున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ కరెంట్ అధికారులు స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఇటు వంటివి మళ్లీ పునరావృత్తం కాకుండా చూడాలని గ్రామస్థులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

దస్తురాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో శనివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని బుట్టాపూర్ గ్రామానికి చెందిన మామిడి పోచయ్య(58) ఈ నెల 13వ తేదీన తన వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో పోచయ్య స్పృహ తప్పి అక్కడికక్కడే కుప్పకూలగా, ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుమారుడు మామిడి తిరుపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పార్‌పెల్లిలో జాలరి మృతి

లక్ష్మణచాంద,నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చేపలు పట్టే వల పొరపాటున కాళ్లకు చుట్టుకుని చేపల వేటకు వెళ్లిన జాలరి విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ మెంగు కిషోర్(65) ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రీనివాస్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన కిషోర్ తమ కుల వృత్తి అయిన చేపల వేటకు శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గ్రామ సమీపంలోని గోదావరి నదికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి ఇంకా రాక పోవటంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, సోదరులు అదేరోజు సాయంత్రం 7 గంటల ప్రాంతంలో గోదావరి ఒడ్డున వెతికారు. నీటిపై తేలియాడుతున్న శవాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సోదరుడు మెంగు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారించగా చేపల వల కాళ్లకు చుట్టుకుని ప్రమాదవశాత్తు మృతి చెంది నట్లు ఎస్సై శ్రీనివాస్ వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

తానూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బామ్నితండా గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాథోడ్ దేవిదాస్‌పై కేసు నమోదయినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బెల్‌తరోడా ఎక్స్‌రోడ్డు సమీపంలో ఆటో డ్రైవర్ రాథోడ్ దేవిదాస్ ఆటోను అతివేగంగా నడపడంతో అక్కడే వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఆటో ఆపినందుకు కానిస్టేబుల్‌ను బూతుమాటలు తిట్టి బెదిరించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు శనివారం ఆటో డ్రైవర్ దేవిదాస్‌పై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

కేసు నమోదు

తానూర్,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి తానూర్‌కు చెందిన పలువురిపై కేసు నమోదు అయినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని గ్రామానికి చెందిన ఇబ్రహిం ఖురేషి అనే వ్యక్తికి బంధువలైన వసీం ఖురేతో పాటు జలాల్, అన్వర్, అజీజ్, హరుణ్, అబ్దుల్, అనే ఆరుగులు పాత క్షల దృష్టిలో పెట్టుకొని కర్రతో కొట్టడంతో ఇబ్రహింకు గాయాలు కాగా అతనికి చికిత్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇబ్రహిం ఫిర్యాదు మేరకు వసీం ఖురేషితో పాటు, జలాల్, అన్వర్, అజీజ్, హరుణ్, అబ్దుల్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హరుణ్ ఖురేషి అనే వ్యక్తికి ఇబ్రహింతో పాటు అతని బంధువులు బసీర్, యునుష్, వసీం, కాస్మల్ తమకు అకారణంగా గొడవ చేశారని స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇబ్రహిం ఖురేషితో పాటు బసీర్, యునుష్, వస్సీ, ఇస్మాల్‌పై కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

విద్యాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలి

- విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామస్థులు సహకరించాలి
- రైతులు తమ పంటను దళారులకు అమ్ముకొని మోసపోవొద్దు
- ముధోల్ ఎమ్మెల్యే పవార్‌రామారావు పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్


వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసారూరల్,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు ఎమ్మెల్యే పవార్‌రామారావు పటేల్ వెల్లడించారు. భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో జడ్పీ హైస్కూల్‌లో ఉపాధి హామీ నిధులు రూ.12 లక్షలతో ప్రహరీగోడ నిర్మాణానికి భూమి పూజ చూసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామస్థులు సహకరించాలన్నారు. పాఠశాలల అదనపు గదుల నిర్మాణానికి తాను నిధులు ఇవ్వడానికి సిద్ధమేనని, సంఖ్యను పెంచాల్సిన బాధ్యత గ్రామస్థులపై ఉందన్నారు. విద్యతోనే సర్వతో ముఖాభివృద్ధి సాధించగలుగుతామని, మరింత మెరుగైన విద్యను ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. తాను ఒక రైతు బిడ్డనేనని ఈ స్థాయికి రావడానికి విద్యనేనని, తల్లిదండ్రులను, గురువులను ఎప్పటికీ మర్చి పోవద్దన్నారు. ఈ సందర్భంగా వానల్‌పాడ్ గ్రామస్థులు పలు సమస్యలను విన్నవించగా, దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావుపటేల్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో నీరజ్, ఎంపీవో జాదవ్ ప్రదీప్, సీనియర్ నాయకులు సోలంకి భీమ్ రావు, గౌర శ్రీనివాస్, గణేష్ పటేల్, భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సీరంసుష్మారెడ్డి, స్థానికనాయకులు చందర్ పటేల్, సాయరెడ్డి, సీనియర్ అడ్వకేట్ గంగాధర్, మాజీ సర్పంచ్‌లు రాము,ముత్యంరెడ్డి,ఆయాగ్రామాల బీజేపీ నాయకులు,మాజీప్రజాప్రతినిధులు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రామారావు పటేల్

మండలంలోని తిమ్మాపూర్, వానల్‌పాడ్, పేండ్‌పెల్లి, కోతుల్‌గాం గ్రామాల్లో శనివారం వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు తమ పంటను దళారులకు అమ్ముకొని మోసపోవద్దని సూచించారు. ప్రతీ రైతు పట్టా పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, ఆన్‌లైన్ పేపర్ వరి కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలని తెలిపారు. మూడు నెలలు కష్టపడి పండించిన పంటను కేంద్రం వద్ద అమ్ముకోవాలని సూచించారు. రైతులను ఎటు వంటి ఇబ్బంది పడకుండా చూసుకోవాలన్నారు. క్వింటాల్ ధర రూ. 2,383 ప్రభుత్వం కల్పిస్తుందని, ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, మాజీ ఎంపీపీ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ భోజన్న, మండల అధ్యక్షుడు సుష్మా, మాజీ జడ్పీటీసీ సోలంకి భీమ్‌రావు, యువనాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, గంగారెడ్డి, ఐకేపీ ఇన్‌చార్జి లక్ష్మణ్, డ్వాక్రా మహిళలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సమగ్ర దర్యాప్తు


పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నూతన పోలీసు సిబ్బంది కేసుల దర్యాప్తు, పరిశోధనలో మరింత నాణ్యత ప్రమాణాలు పాటించడానికి ఐదు రోజుల పాటు 21 పోలీస్ స్టేషన్‌ల సిబ్బందికి అందించిన శిక్షణ శనివారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందికి విస్తృత సూచనలు చేశారు. నేరస్తులకు శిక్షలు పడినప్పుడే బాధితులకు న్యాయం లభిస్తుందని, పోలీసుల పట్ల గౌరవం పెరుగుతుందని తెలిపారు. ఎఫ్ఐఆర్ మొదలు కస్టడీ, అరెస్ట్, రిమాండ్ చివరికి జైలు వరకు పోలీసు రైటర్ల పాత్ర కీలకమని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్క ఫైల్‌ను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయస్థానం ముందు దాఖలు చేయాలని తెలిపారు. నెల రోజులకు ఒకసారి నిర్వహించే ఇన్వెస్టిగేషన్ ఆడిట్లో పాల్గొని సిబ్బంది చేస్తున్న పొరపాట్లను సరిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, డీసీఆర్బీ ఎస్సైలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న గ్రంథాలయ చైర్మన్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా సీనియర్ రచయిత బీ.మురళీధర్, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం అందుబాటులో ఉంచిన పుస్తకాలను పరిశీలించారు. జిల్లా కవులు రచించిన రచనలు ప్రత్యేకంగా ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తెలిపారు. 250 పుస్తకాలు ప్రదర్శనలో ఉన్నాయని పేర్కొన్నారు. పుస్తక ప్రియులు, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలను చదివి జ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాముల రాజవర్ధన్, వసంత రావు దేశ్‌పాండే, ఉదారి నారాయణ, అనుముల దయాకర్, జిల్లా కవులు పాల్గొన్నారు

మిల్లత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ పరీక్ష

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మిల్లత్ ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ మిల్లత్ సమాజానికి చెందిన విద్యార్థుల కోసం కృషి చేస్తుందని క్రీసెంట్ గ్రూప్ చైర్మన్ మహ్మద్ బిలాల్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి స్కాలర్‌షిప్ పరీక్షలో అర్హత సాధించిన వెయ్యి మంది విద్యార్థులకు రూ.పది కోట్ల స్కాలర్‌షిప్‌లు అందించబడతాయని, ఆరు ప్రసిద్ధ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందే అవకాశాలు కల్పించబడతాయని స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. 2026 నవంబరు 25రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ అని, 30వ తేదీన పరీక్ష ఉంటుందన్నారు. సమావేశంలో మహ్మద్ రఫీ, అబ్దుల్ మజీద్, వజాహత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నేతల పరామర్శ


చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ/బజార్‌హత్నూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాట్లొద్ది గ్రామానికి చెందిన ఆడే మీరాబాయి తేర్వి కార్యక్రమానికి శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ తేర్వి కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆడే వసంత్ రావు, కుంటాల సర్పంచ్ అశోక్, యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు ఆడే రమేష్, బానోతు వసంత్, కళ్యాణ్, మౌలానా, మహేందర్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బజార్ హత్నూర్ మండల కేంద్రానికి చెందిన కొర్తల్ వార్ అమర్, అజయ్‌ల తల్లి చందాబాయి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. కాగా వారికి సీఎంఆర్ ఎఫ్ పథకం ద్వారా మంజూరైన ఒక్క లక్ష డెబ్బై ఐదు వేల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.వారితో సాయి చైతన్య, నాయకులు ఉన్నారు.

జనావాసాల మధ్య వైన్‌షాప్ ఏర్పాటు చేస్తే ఊరుకోం

బోథ్, నవంబర్15 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జనావాసాల మధ్యన వైన్‌షాప్ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని బస్టాండ్ ప్రాంతంలోనివాసం ఉంటున్న కాలనీ వాసులు స్థానిక తహసీల్దార్ సుభాస్‌చంద్రకు శనివారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. నాలుగవ బ్లాక్ చెందిన కాలనీలో జనావాసాల మధ్యన మద్యం షాపు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు కలిగే అస్కారం ఉన్నందున వైన్‌షాపును జనావాసాలకు దూరంగా ఉంచాలని వారు తహసీల్దార్‌కు విన్నవించారు. అయితే ఈ విషయమై ఎక్సైజ్ సీఐని వివరణ అడగగా మేము నిబంధనల ప్రకారమే వైన్‌షాప్ ఏర్పాటుకు అనుమతులిస్తున్నామన్నారు. కావాలని మేము వైన్‌షాప్ అనుమతులు ఇవ్వడం లేదన్నారు. నిబంధనలన్నింటిని పరిగణలోకి తీసుకొని అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కాగా కాలనీ వాసులు మాత్రం బలవంతంగా వైన్‌షాప్ ఏర్పాటు చేస్తే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. అంతేకాక ఎక్సైజ్ సీఐ మాత్రం ఈ విషయంలో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని కాలనీ వారు వాపోయారు.


బోథ్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన ముగ్గురిపై కేసు

- మరోనిందితుడు పరారీలో..


పట్టుబడిన నిందితులతో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్‌నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఆటో డ్రైవర్‌పై అకారణంగా దాడి చేసి చరవాణి లాక్కున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ కే. నాగరాజు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన జాదవ్ శ్రీనివాస్, రాథోడ్ సందీప్, వికాస్ మద్యం మత్తులో ఉండి ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ బద్దీడ్ కైలాష్ తో గొడవ పెట్టుకున్నారు.అనంతరం అతనిపై దాడి చేసి చరవాణి లాక్కున్నారు. ఈ మేరకు బాధితుడు శనివారం ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేశామన్నారు. జాదవ్ శ్రీనివాస్, రాథోడ్ సం దీప్‌లను అరెస్ట్ చేశామని, మరోనిందితుడు పరారీలో ఉన్నాడన్నారు.

వాగులో దూకి తల్లి మృతి

- తల్లిని కాపాడబోయిన కొడుకు అదృశ్యం
- కుటుంబ కలహాలే కారణం
- లోతు ఎక్కువగా ముళ్ల పొదలు ఉండటం వల్ల గాలింపు చర్యలకు ఆటంకం


వాగులో స్వరూప మృతదేహం

బాసర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):కుటుంబ కలహాలు,ఆర్థిక సమస్యలతో మన స్తాపం చెందిన తల్లి వాగులో దూకి ఆత్మహత్యా యత్నం చేయగా, ఆమెను రక్షించబోయిన కుమారుడు అదృశ్యమైన విషాద ఘటన శని వారం బాసర మండలం టాక్లి గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టాక్లి గ్రామానికి చెందిన చిల్లెవాడ్ స్వరూప (55)గ్రామ సమీపంలో ఉన్నవాగులో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఈ విషయం తెలుసుకున్న ఆమెకుమారుడు, శ్రీనివాస్ (28), తల్లిని కాపాడాలనే ప్రయత్నం లో వెంటనే వాగులోకి దూకాడు.

వంతెనపై చెప్పులు..వాగులో గాలింపు


అయితే,వాగు వంతెనపై తల్లి, కొడుకులకు సంబంధించిన చెప్పులు మాత్రమే ఉండడాన్ని గమనించిన గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా...అప్పటికే స్వరూప నీట మునిగిమృతి చెందింది. మృతదేహం నీటిపై తేలడంతో బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ ఆచూకీ మాత్రం దొరకలేదు. వంతెన వద్ద అతని చెప్పులు మాత్రమే లభించాయి. నీటిలో లోతు ఎక్కువగా ఉండటం, ముళ్ల పొ దలు ఉండటం వల్ల గాలింపు చర్యలు కష్టంగా మారాయని పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలే కారణం

కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల కారణంగానే స్వరూప ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తల్లిని రక్షించబోయి కనిపించకుండా పోయిన శ్రీనివాస్ కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు వాగులో గాలిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.3, కనిష్ఠం 10.2



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

ఆదివారం 16 నవంబరు 2025



● జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లను కప్పుకొని నిద్రిస్తున్న విద్యార్థులు



● ఇచ్చోడలోని కేజీబీవీ పాఠశాలలో పనిచేయని వాటర్ హీటర్ ప్లాంట్

వసతి.. ఆగమాగం!

" అరకొర వసతులు, అధ్వానపు పరిస్థితులతో జిల్లాలో వసతి గృహాలన్నీ ఆగమాగంగానే కనిపిస్తున్నాయి. కనీసం శానిటేషన్ పనులు సక్రమంగా చేపట్టక పోవడంతో వసతి గృహాల పరిసరాలు అధ్వానంగా మారి దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా, జ్యోతిబాపూలే, ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. అసలే శీతాకాలం.. పైగా శీతల గాలులు వీచడంతో వసతి గృహాల్లో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. శీతాకాలం సీజన్ ప్రారంభంకావడంతో తీవ్రమైన చలితో విద్యార్థులు వణికి పోతున్నారు. "

- జిల్లాలో అత్యల్పంగా నమోదవుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- అరకొరగానే దుప్పట్ల పంపిణీ.. సరఫరా కాని వెచ్చని దుస్తులు
- మరమ్మతులకు నోచుకోని వాటర్ హీటర్లు.. చన్నీళ్ల స్నానాలతో వణుకు
- స్పందించని జిల్లా అధికారులు, అవస్థల్లో వసతిగృహాల విద్యార్థులు

ఆదిలాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 10 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయినా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అధికారులు విద్యార్థుల కు అవసరమైన సౌకర్యాలను కల్పించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నా యి. గత కొన్నాళ్ల క్రితమే ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను పెంచినా.. అరకొరగానే పంపిణీ చేస్తున్నారు. వసతి గృహాల అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొంత మంది వార్డెన్‌లు స్థానికంగా ఉండడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇరుకు గదుల్లోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం బెడ్ మంచాలు కూడా లేకపోవడంతో కటికనేల పైనే నిద్రపోతున్నారు. మెనూ ప్రకారం నిత్యావసర సరుకులు సరఫరాకాక పోవడంతో ఉన్న దాంట్లోనే సరిపెడుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వసతి



అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

పాత దుప్పట్లే దిక్కు

చలి సీజన్ ప్రారంభమై పక్షం రోజులు గడిచిపోతున్నా.. ఇప్పటి వరకు వసతి గృహాల విద్యార్థులకు వెచ్చని దుస్తులను సరఫరా చేయలేదు. దీంతో తీవ్రమైన చలితో వణికి పోతున్నారు. గతేడు పంపిణీ చేసిన దుప్పట్లతోనే సరిపెడుతున్నారు. కొన్ని మండలాల్లో ఇద్దరు విద్యార్థులకు కలిపి ఒకే దుప్పట్ల జతను అందజేసినట్లు తెలుస్తోంది. అలాగే దుప్పట్లు మందంగా లేకపోవడంతో చలికి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అరకొర దుప్పట్ల పంపిణీతో విద్యార్థులు ఇంటి నుంచే వెచ్చని దుప్పట్లను తెచ్చుకొని కప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వెచ్చని దుస్తువులు సైతం అందించక పోవడంతో విద్యార్థులు సొంతంగానే సమకూర్చుకుంటున్నారు. దోమల భారీ నుంచి కాపాడుకునేందుకు దోమల తెరలు కూడా లేకపోవడంతో తరుచు విద్యార్థులు అనారోగ్య భారీన పడుతున్నారు. తీవ్రమైన చలిగాలులతో విద్యార్థులు గజగజ వణుకుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో జిల్లా ఉన్నతాధికారులు వసతి గృహాల్లో

(తరువాయి 6వ పేజీలో....)



ఇచ్చోడ మండలకేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో కనిపించని వాటర్ హీటర్లు

పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాఠశాలల మౌలిక సదుపాయాల పై కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పాఠశాలల మౌలిక సదుపాయాల పనుల్లో ఏ మాత్రం ఆలస్యం జరిగినా సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి పనికి స్పష్టమైన టైమ్? లైన్? ఖరారు చేసి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇటీవల దశల వారీ సమావేశాల్లో ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు సూచించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఖాన్ అకాడమీ విధానం ఉపాధ్యాయుల బోధనను మరింత సులభతరం చేస్తుందని, దీనిపై పూర్తి అవగాహనతో తరగతుల్లో అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి పీఎం శ్రీ సమీక్షలో భాగంగా ఈ నెల 21న ఉన్నతాధికారులు జిల్లాకు రానున్న నేపథ్యంలో, బోథ్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో అవసరమైన ఏర్పాట్లను అత్యంత ప్రాధాన్యంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి రాజేశ్వర్, సెక్టోరల్ అధికారులు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాజీమార్గంతో కేసుల సత్వర పరిష్కారం



కక్షిదారులకు పత్రాలు అందిస్తున్న జిల్లా న్యాయాధికారి కే.ప్రభాకర్ రావు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌లో రాజీపడతగిన కేసులను పరిష్కరించ కుని, సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి కే.ప్రభాకర్ రావు సూచించారు. జిల్లా కోర్ట్ ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారుల మధ్య రాజీ మార్గంలో కేసులను పరిష్కరించి వారికి సంబంధిత పత్రాలను అందించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలనే ఉద్దేశంతో లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి కే.ప్రభాకర్ రావు తెలిపారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారుల మధ్య సయోధ్య కుదిర్చి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరిస్తున్నానని, ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్య లక్ష్మి, న్యాయాధికారులు కుమార్ వివేక్, లక్ష్మి కుమారి, హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్రాల నగేష్ పాల్గొన్నారు.

వామ్మో చలి...

● బజార్‌హత్నూర్‌లో అత్యల్పంగా 8.6 ఉష్ణోగ్రతలు నమోదు



ఆదిలాబాద్ జిల్లా పరిసర ప్రాంతాల్లో కప్పేసిన దట్టమైన పొగమంచు

ఆదిలాబాద్, నవంబర్15 (ఆంధ్రజ్యోతి): చలి గాలుల ప్రభావంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా చలితీవ్రత కనిపిస్తుంది.దీంతో వామ్మోచలి అంటూ జనం వణికిపోతున్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 29.3 కాగా కనిష్ఠంగా 10.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా బజార్‌హత్నూర్ మండలంలో 8.6, బోథ్ మండలం పొచ్చెరలో 9.2, భీంపూర్ మండలం అర్లి(టి)లో 9.6, నేరడిగొండలో 9.7, సాత్నాలలో 10.0, ఇచ్చోడలో 10.5,ఇంద్రవెల్లిలో 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నాయి. దీంతో ఉదయం రాత్రి వేళల్లో తీవ్రమైన చలి ప్రభావం కనిపిస్తుంది. మారుమూల గిరిజన గ్రామాల్లో చలి మంటలు వేసుకుంటు ఇంటి పనులను పూర్తి చేసుకుంటున్నారు. కొందరైతే రాత్రంతా వెచ్చదనం కోసం ఇండ్లలో నిప్పుల కుంపటిని పెట్టుకుని నిద్రపోతున్న పరిస్థితులు ఉన్నాయి. చలి నుంచి పశువులను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యేక ఏర్పాట్లను చేసుకుంటున్నారు. రాత్రిళ్లు ఆరుబయట పశువులను ఉంచకుండా ఇండ్లలోకి తరలిస్తున్నారు. ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కనిపిస్తుంది. దీంతో జాతీయ రహదారి పై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఉదయం వేళల్లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన



ఈవీఎం గోదాం వద్ద కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని ఈవీఎం గోదాంను కలెక్టర్ రాజర్షి షా శనివారం నెలవారీ తనిఖీలో భాగంగా పరిశీలించారు. గోదాంలో భద్రపరిచిన యంత్రాల స్థితి, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరా వ్యవస్థ, బారికేడింగ్ వంటి అంశాలను ఆయన సమగ్రంగా పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈవీఎం-వీవీపీఏటీల భద్రతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండకూడదని, ప్రతి నెలా నిర్వహణ పద్ధతులను కచ్చితంగా పర్యవేక్షించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు పంచపూల, భద్రతా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీర్సాముండాకు ఘన నివాళి



మాట్లాడుతున్న ఎంపీ గోడంనగేష్



చింతల సాంగ్విలో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



గుడిహత్నూర్‌లో...

ఉట్నూర్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న భారత ప్రధాన నరేంద్రమోదీ చొరవతో మహనీయుల చరిత్రలు బయటకు వస్తున్నాయని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడంనగేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీర్సాముండా జన జాతీయ గౌరవ దివాస్ పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, డీడీ అంబాజీజాదవ్, ఆదివాసీ పెద్దలతో కలిసి బీర్సాముండా చిత్రపటానికి పూజలు చేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలనను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, డీడీ అంబాజీ జాదవ్‌లు ప్రసంగించగా ఏటీడీఓ సదానందం, ఈఈతానాజి, జీసీసీ ఇన్‌చార్జీ డీఎం సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం, జిల్లా మేడిమేస్రం దుర్గుపటేల్, పెందూర్ ప్రభాకర్, పెందూర్ దాదివారావు, దుర్గబాబురావు, కుడిమెత తిరుపతి, డాక్టర్ మేస్రం మనోహర్, మరుసుకోల తిరుపతి, బొంత ఆశారెడ్డి పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి గృహం ఆవరణలో గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో భగవాన్ బీర్సాముండా జెండాను శనివారం ఆవిష్కరించారు.

బజార్‌హత్నూర్ : దోపిడీపై గళమెత్తి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వయం పాలన నినాదంతో సమరశంఖం పూరించిన బిర్సాముండా ఆదర్శ ప్రాయుడని కార్యదర్శి సుధీర్, సిడాం సుభాష్‌లు అన్నారు. మండలంలోని చింతల సాంగ్వి, న్యూ అనంతపురం ఆదివాసీ గ్రామాల్లో శనివారం బిర్సాముండా జయంతిని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలోపెందూర్ భూమన్న, లక్ష్మన్, యాదవ్ జంగు, తుమ్రామ్ శ్రీరామ్, పెందూర్ జుగాదిరావ్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్ : మండల కేంద్రంలోని ఆదివాసి విజ్ఞాన కేంద్రం ఆవరణలో శనివారం ఆదివాసి సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగవాన్ బీర్సా ముండా జయంతి ఘనంగా నిర్వహించారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసి సేనా జిల్లా అధ్యక్షుడు బీరాయి సిడం జంగుపటేల్, ఆదివాసి విద్యార్థి సేనా జిల్లా కన్వీనర్ కోట్నాక్ గణేష్, కో-కన్వీనర్ చత్రుఘన్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ఆదివాసీల సమస్యలపై బిర్సా ముండా చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమని, ఇవి నేటి యువతకు స్ఫూర్తి అని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూర్కా చిత్రు అన్నారు. కార్యక్రమంలో రాగల్ జెండా చైర్మన్ తొడసం నాగోరావు, ఆదివాసేన మండల అధ్యక్షులు మెస్రం సుదర్శన్, తుడుం దెబ్బ జిల్లా కోశాధికారి కోట్నాక్ బారిక్ రావ్, జిల్లా ఉపాధ్యక్షులు గెడం భారత్, గౌరవ అధ్యక్షులు జుగ్నాక్ భారత్, రాజ్ గోండ్ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం రాందాస్ పాల్గొన్నారు.

తాంసి : గిరిజనుల ఆరాధ్య దైవమైన బిర్సా ముండా జయంతిని శనివారం తాంసి మండలంలో ఘనంగా జరుపుకున్నారు. అట్నంగూడా, గిరిగావు, అంబుగావ్ గ్రామాలలో బీర్సముండా చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు భరత్, యశ్వంత్, సాంబాజి పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్ : సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బిర్సా ముండ అని, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన క్రాంతి వీర్ భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. బిర్సా ముండా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి సమర్పించారు. ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేసుకుంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, ఆదివాసీ నాయకులు సిడాం రామ్ కిషన్, తానాజీ, జోగు రవి, ఆదినాథ్, భీం సేన్ రెడ్డి, రాజు, రాకేష్, సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా చిన్న వయసులోనే బ్రిటీష్ వాళ్లను గడగడలాడించిన గొప్ప ధైర్యశాలి అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు అన్నారు.

ఆదిలాబాద్ టౌన్ : జిల్లా కేంద్రంలో నిర్వహించిన జన జాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని బిర్సా ముండా విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, గిరిజన నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఇచ్చోడ : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ చౌక్‌లో ఆదివాసీ సంఘాలు, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీ సమాజ సంస్కృతులతో పూజా కార్యక్రమాలను నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆత్రం మహెందర్, నాయక్‌పోడ్ నాయకులు సంగెపు రమేష్ పాల్గొన్నారు.

బోథ్ :బీర్సాముండా గొప్ప పోరాట యోధుడని ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరు ముందుకు వెళ్లాలని ఐటీడీఏ మాజీడైరెక్టర్ మేస్రం భూమన్న పిలుపునిచ్చారు.శనివారం పార్టీ బి రాయిసెంటర్లలో బీర్సాముండా జయంతి వేడుకలు జరుపుకున్నారు.



స్మృతివనంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



పూలమాలలు వేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వొద్దు

● పోలీస్‌స్టేషన్ పరిశీలించిన ఎస్పీ అఖిల్ మహాజన్



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

బజార్ హత్నూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పోలీసు సిబ్బంది పర్యవేక్షణ పెంచాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సీఐ గురుస్వామిలతో కలిసి పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ సిబ్బందికి కేటాయించిన వస్తువులను వారి సర్వీస్ రికార్డులను పరిశీలించారు. ఆవరణలో ఉన్న వాహనాల స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి గుడుంబా మాదకద్రవ్యాలు, గంజాయిలతో భవిష్యత్తు అంధకారం అవుతుందని, చైతన్య పరచాలని సూచించారు. పోలీసు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కళాశాలలో పాఠశాలలను సందర్శించాలని సూచించారు. మహిళల పట్ల వేధింపులు, చిన్నారుల నేరాలు, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటిని అరికట్టే దిశగా కృషి చేయాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, బోథ్ సీఐ గురుస్వామి, ఎస్సై జి.సంజయ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై దృష్టి సారించండి

బోథ్ : మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులపైన నిరంతరం నిఘా పటిష్టంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠమైన నిఘా ఏర్పాటు చేసి నేరాల అదుపునకు కృషి చేయాలన్నారు. పొరుగునే మహారాష్ట్ర ఉన్నందున అక్రమ రవాణాకు అస్కారం ఉంటుందని, అక్రమ రవాణాపైన దృష్టి సారించాలన్నారు. మరో వైపు గంజాయి అక్రమ రవాణా పైన దృష్టి సారించాలని పేర్కొన్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించిన కేసులు తప్పవని పేర్కొన్నారు. ఈ విషయమై అన్ని గ్రామాలలో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. పోలీసులు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కేసుల దర్యాప్తులో పెండింగ్ ఉండవద్దని సూచించారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, స్థానిక సీఐ గురుస్వామి, ఎస్సై శ్రీసాయి ఉన్నారు.

బస్సు లేక బడి పిల్లల బాధలు



ప్రైవేట్ వాహనం ఎక్కి వెళుతున్న దృశ్యం

భీంపూర్ , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలం కరంజీ (టీ), ఆర్లీ (టి) ఉన్నత పాఠశాలలలో చదువుతున్న పరిసర గ్రామాల విద్యార్థులు సకలంలో బస్సులు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం బడికి వెళ్ళే సమయంలో కూడా బస్సులు లేక ఆ తర్వాత బడి సెలవు అయిన తర్వాత గ్రామాలకు వెళ్ళడానికి బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సాయంత్రం బడి సెలవు తర్వాత శనివారం కూడా ఇలాగే బస్సులు లేక గోముత్రి, అంతర్గవ్‌కి వెళ్లాల్సిన పిల్లలు కరంజీ (టి) లో ఇలా ప్రైవేట్ వాహనం ఎక్కాల్సి వస్తుంది.